# వృద్ధ సంస్కృతి !

మొదటి నుంచీ మనకు వృద్ధ నాయకత్వానికే అగ్రపీఠం. ఆ విధంగా మనది వృద్ధ రాజకీయ సంస్కృతి.

అయోధ్యను పాలించిన దశరథుడు వృద్ధుడు. అతని గురువు వశిష్టుడు వృద్ధుడు.

ఇంద్రప్రస్థాన్ని ఏలిన ధృతరాష్ట్రుడు వృద్ధుడు. ఇక భీష్ముడు సరేసరి, కురువృద్ధుడు.

వృద్ధ రాజకీయ సంస్కృతి మనది అంటే, ఒక్క భారతదేశానిదే అని కాదు. ప్రపంచానిది అని కూడా.

కొందరు అధికారంలోకి వచ్చేటప్పటికి వృద్ధులు కానప్పటికీ, వృద్ధులుగానే అధికారాన్ని అంటిపెట్టుకున్న వాళ్ళు ఉన్నారు. అరవైలలో ఉంటే వృద్ధుడు, డెబ్భైలలో ఉంటే కురువృద్ధుడు.

చైనాలో విప్లవం తెచ్చి, అధికారంలోకి వచ్చి, దేశాన్ని పాలిస్తూనే కన్నుమూసేటప్పటికి మావో వృద్ధుడు. అవిభక్త సోవియట్ రష్యాను పాలిస్తూ, అధికారం పోయే నాటికి గోర్బచేవ్ చిరు వృద్ధుడు. అలాగే ప్రస్తుతం ముక్కచెక్కలైన రష్యాను పాలిస్తున్న ఎల్సిన్ కూడా చిరు వృద్ధుడు.



ర్శిగా పనిచేసిన చంద్రరాజేశ్వరరావు కురువృ వించినట్టు జరిగిన

మళ్లీ మన భారత రాజకీయాల్లోకి వస్తే మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయే నాటికి కురువృద్ధుడే. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని అయ్యే నాటికి వృద్ధుడు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉంటూ దారుణ హత్యకు గురయ్యేనాటికి వృద్ధురాలే. మురార్జీ దేశాయ్ ప్రధాని పదవిలోకి వచ్చే నాటికే కురువృద్ధుడు. ఒక్కరోజైనా ప్రధాని పీఠం మీద కూర్చోవాలని ఎడతెగని కలలు కని సాధించుకున్న చరణ్‌సింగ్ కూడా కురువృద్ధుడే.

రాజీవ్‌గాంధీ ప్రధాని కావడంతో అలాంటి వృద్ధ, కురువృద్ధ సంస్కృతికి నిష్కృతి కలిగింది. భారత రాజకీయ వెండితెరపై యవ్వనకాంతులు తళతళలాడాయి. రాజీవ్ దారుణ హత్యతో అదృష్టం కలిసొచ్చి ప్రధాని అయిన పి.వి. నరసింహారావు కూడా కురువృద్ధుడే. ప్రధాని పదవిపోయి, కాంగ్రెస్ అధ్యక్షుడిగానూ జోడు పదవుల్లో ఉంటూ జె.ఎం.ఎం. ముడుపుల కేసులోనూ, లఖూభాయ్ పాఠక్ కేసులోనూ విచారణ కోసం కోర్టుకెళ్ళాల్సి వచ్చినప్పుడు తాను వయో వృద్ధుడిననీ, ఆ కారణంగా స్వయంగా తాను కోర్టుకు హాజరుకానవసరం లేకుండా అనుమతి ఇవ్వాలనీ పీవీయే వేడుకున్నాడు. ప్రస్తుత ప్రధాని గుజ్రాల్ కూడా కురువృద్ధుడే!

ఇక వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల విషయానికొస్తే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కురువృద్ధుడు. ఒరిస్సా ముఖ్యమంత్రిగా పదవి చేపట్టేటప్పటికి బిజూ పట్నాయక్ కూడా కురువృద్ధుడే. ఇప్పుడు ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న జె.బి. పట్నాయక్ చిరువృద్ధుడు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి

నుంచి తప్పుకునేటప్పటికి విజయభాస్కర్‌రెడ్డి కురువృద్ధుడు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ, ఆ పదవిపోయి, చనిపోయినప్పుడూ ఎన్టీ రామారావు కురువృద్ధుడే. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉంటూ కోమాలోకి వెళ్లి ఆ రాష్ట్రాన్ని పాలించిన ఎం.జి. రామచంద్రన్ కురువృద్ధుడు. ప్రస్తుతం ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న కరుణానిధి కూడా కురువృద్ధుడే.

ఉద్యోగస్తులకు ఏభై ఎనిమిది, అరవై ఏళ్లకు రిటైర్‌మెంటు ఉంది. ఆ వయసు దాటాక వాళ్లు సరిగ్గా పనిచెయ్యలేరని ప్రభుత్వాలు నమ్మాయి. అయితే, ఆ ప్రభుత్వాలనే పాలించే వాళ్లకు వయసుతో పనిలేదు. రిటైర్‌మెంట్ లేదు.

జర్నలిస్టులకూ, పొలిటీషియన్లకూ కొన్ని విషయాల్లో అవినాభావ సంబంధముందని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓ సందర్భంలో అన్నాడు. "రాజకీయ నాయకులకు డిగ్రీల అవసరం లేదు. అలాగే జర్నలిస్టులకూ పొలిటీషియన్లకూ రిటైర్‌మెంటు వయసు లేదు. అలాగే జర్నలిస్టులకూనూ" (అప్పట్లో వీరికీ రిటైర్మెంట్ నిబంధన లేదు) అని నవ్వుతూ చమత్కరించాడాయన.

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన చండ్ర రాజేశ్వరరావు కురువృద్ధుడే!. అలాగే సిపిఎం ప్రధాన కార్యదర్శిగా పని చేసిన నంబూద్రిపాద్ కూడా కురువృద్ధుడే!

కురువృద్ధుడైన పీవీ నరసింహారావు కోర్టు కేసుల కారణంగా తన జోడు పదవుల్లో ఒకదాన్ని వదులుకోవాల్సి వచ్చినప్పుడు ఆయన ఏ యువకుడినీ ఎంచుకోలేదు. తనలా వయసు మీరిన కేసరికే అధ్యక్ష పదవి కట్టబెట్టాడు. ఆ తర్వాత కేసరి పీవీ పార్లమెంటరీ పార్టీ పదవికే ఎసరుపెట్టాడు.

చరణ్‌సింగ్‌కు లాగానే కేసరికీ ప్రధాని పదవిపై ఆశలున్నాయి. అయితే, చరణ్‌సింగ్ ఆ విషయాన్ని బాహాటంగానే చెప్పుకున్నాడు. కేసరి నోటితో చెప్పకుండా చేతల్లో చూపించాడు. అయితే ఆయన అనుకున్నది ఒక్కటి, అయ్యింది ఒక్కటి! ఆయన ప్రధాని ఆశ బుల్‌బుల్ పిట్టలా బోల్తా కొట్టింది. యునైటెడ్ ఫ్రంట్‌కు మద్దతు ఉపసంహరించుకుని, గౌడను ప్రధాని పదవి నుంచి తప్పిస్తేనే తిరిగి మద్దతు ఇస్తామని ప్రకటించి, తనక్కావల్సింది సాధించుకున్న కేసరి ఇప్పటికీ తాను అలా ఎందుకు చెయ్యాల్సి వచ్చిందో వివరించమని తన పార్టీవాళ్లే అడిగినా స్పష్టం చేయలేకపోతున్నాడు.

ఉన్న కాంగ్రెస్ అధ్యక్ష పదవి కాస్తా ఎక్కడ చేజారిపోతుందోనని కేసరికి ఇప్పుడు కొత్త భయం పట్టుకుంది. సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకోవడంతో ఆయన లోలోపల కుమిలిపోతున్నట్టున్నాడు. అందుకే, కొద్దిసేపట్లోనే కేసరి విభిన్న వ్యాఖ్యలు చేశాడు. సోనియాకు పార్టీ అధ్యక్ష పదవి కట్టబెడతారా అని అడిగితే, ఆమె ప్రాథమిక సభ్యురాలు మాత్రమేనన్నాడు. పార్టీ నియమావళిని కూడా గమనించాలన్నాడు. పార్టీ నియమావళి ప్రకారం ప్రాథమిక సభ్యులకు ఓటు హక్కు ఉండదు. క్రియాశీల కార్యకర్తలు మాత్రమే సంస్థాగత ఎన్నికల్లో పోటీచేయడానికి అర్హులు. అంటే తన పదవికి ఇప్పట్లో ప్రమాదం లేదని కేసరి పరోక్షంగా చెప్పాడన్న మాట. సోనియా పార్టీ ప్రవేశం పట్ల కేసరి హర్షాన్ని వ్యక్తం చేసినప్పుడు ఆయన ముఖంలో ఆనందం కనిపించలేదు. సోనియా తమవల్లే పార్టీలో చేరిందని ఎవరూ గొప్పలు కొట్టుకోకూడదని చెప్పిన నోటితోనే, "నా విజ్ఞప్తిని మన్నించి పార్టీలో చేరినందుకు సోనియాకు కృతజ్ఞతలు" అంటూ గొప్పలకు పోయాడాయన.

సోనియాగాంధీ పార్టీలో చేరడంవల్ల ఉడుకు నెత్తురుతో ఉవ్వెత్తున లేచిపడే వై.ఎస్. రాజశేఖరరెడ్డి హర్షం వ్యక్తం చేశాడు. ఆమె నాయకత్వం చేపడితే పార్టీకి కొండంత బలం వస్తుందన్నాడాయన. ఆయనలా కొందరు భావించినట్టు జరిగినా జరగకపోయినా వృద్ధ సంస్కృతికి మాత్రం చరమగీతం పాడే రోజులు రావాలి. మహాకవి శ్రీశ్రీ ఏనాడో అన్నాడు-

“ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులారా చావండి. నెత్తురు మండే శక్తులునిండే సైనికులారా రారండి”

16.5.97

వార్త దినపత్రిక